ఈనాడు
హనుమకొండ
సోమవారం అక్టోబరు 7, 2024


## కూష్మాండదేవి అలంకరణలో పద్మాక్షిదేవి



హనుమకొండలోని శ్రీహనుమద్గిరి పద్మాక్షి దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు నాలుగో రోజు ఆదివారం అమ్మవారిని కూష్మాండదేవి (మహాలక్ష్మి) రూపంలో అలంకరించారు. అమ్మవారిని దర్శించుకొని భక్తులు పరవశించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఓఎస్‌డీ సంపత్‌రావు దంపతులు పాల్గొని అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. – న్యూస్‌టుడే, వరంగల్ సాంస్కృతికం

## మహాలక్ష్మి..!

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శివనగర్‌లోని శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయంలో ఆదివారం శ్రీలలితాదేవి అమ్మవారిని భక్తులు నోట్లతో అల్లిన మాలలు, నాణేలతో శ్రీమహాలక్ష్మిగా అలంకరించి పూజలు చేశారు. – న్యూస్‌టుడే, శివనగర్



# భద్రకాళి.. బంగారు తల్లి



స్వర్ణ కిరీటం, జూటామకుటాలు, కర్ణ పత్రాలు

దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ ఇంద్రకీలాద్రిగా పేరుగాంచిన ఓరుగల్లు శ్రీభద్రకాళి అమ్మవారు బంగారు ఆభరణాలతో దివ్య తేజస్సుతో భక్తులకు దర్శనమిస్తున్నారు. అమ్మవారికి ప్రభుత్వం బహూకరించిన స్వర్ణ కిరీటం, జూటా మకుటాలు, కర్ణ పత్రాలతో పాటు భక్తులు సమర్పించిన కానుకలు అనేకం ఉన్నాయి. పసిడి కాంతులతో దర్శనమిస్తున్న భద్రకాళి మాతను చూసి భక్తులు పులకించిపోతున్నారు.

● శ్రీదేవి శరన్నవరాత్రుల్లో రాష్ట్ర ప్రభుత్వం బహూకరించిన స్వర్ణ కిరీటం, జూటా మకుటాలు, కర్ణ పత్రాలు అమ్మవారికి అలంకరిస్తారు. శ్రీభద్రకాళి భద్రేశ్వరుల కల్యాణ బ్రహ్మోత్సవాల్లో కొన్ని ఆభరణాలు అలంకరిస్తారు.


### అమ్మవారి ఆభరణాలు ఇవే..

● బంగారు స్వర్ణ కిరీటం: 4 కిలోల 70 గ్రాముల 088 మిల్లీగ్రాములు ● కర్ణ పత్రములు- 1 కిలో 202 గ్రాముల 004 మి.గ్రా కర్ణ పత్రములు-1 కిలో 149 గ్రాముల 022 మి.గ్రా ● జూటా మకుటం- 2 కిలో 273 గ్రాము 013 మి.గ్రా ● జూటా మకుటం 2 కిలో 368 గ్రాముల 040 మి.గ్రా ● తెల్లరాళ్లతో ముక్కు పోగు పెద్దది: 104 గ్రా. ● చంద్ర వంక బొట్టు: 65 గ్రా 300 మి.గ్రా (124 చిన్న ఎరుపు రాళ్లు, 01 పెద్ద ఎరుపు రాయి) ● ఒక ఎర్ర రాళ్ల బంగారు గాజు 340 గ్రా. ● ఒక ఎరుపు రాయి ముక్కు పోగు 10 గ్రా. ● అష్టలక్ష్మి చెంబు 605 గ్రా 600 మి.గ్రా

● ఒక రాళ్ల ముక్కు పోగు 19 గ్రా 950 మి.గ్రా ● ఒక తెల్ల రాళ్ల ముక్కు పోగు 21 ముత్యాలు, ఒక ఎర్ర పూస, 13.600 మి.గ్రా ● లక్ష్మీ కాసుల నెక్లెస్ 20 గ్రా. 570 మి.గ్రా ● లక్ష్మీ కాసుల పేరు 21గ్రా. 300 మి.గ్రా. ● 2 బంగారు గాజులు 16 గ్రా. 220 మి.గ్రా ● లక్ష్మీ రూపంతో ఉన్న పచ్చల కెంపుల హారం 086- 730 మి.గ్రా ● అమ్మవారి రెండు పెద్ద పుస్తెలు, తాడు, రెండు గొట్టాలు, రాగి తీగతో కలిపి 192 గ్రా. ● పెద్ద ముక్కెర రాళ్లతో 44 గ్రా. ● అమ్మవారి పెద్ద మాంగళ్య సూత్రం, తాడు, బంగారు గొట్టాలు, బంగారు గుండ్లు 130 గ్రా. ● కాసుల పేరు, ఎర్ర ముక్కు పోగు 262 గ్రా. ● ఒక ముక్కు పోగు 18గ్రా 850 మి.గ్రా.

**బ్యాంకు లాకర్‌లోనే..:** రాష్ట్ర ప్రభుత్వం బహూకరించిన స్వర్ణ కిరీటం, జూటా మకుటాలు, కర్ణ పత్రాలు, భక్తులు, దాతలు ఇచ్చిన బంగారు ఆభరణాలన్నీ హనుమకొండలోని బ్యాంకు లాకర్‌లో భద్ర పరుస్తారు. రోజు వారీగా అలంకరించే ఆభరణాలు దేవస్థానంలో ఉంటాయి.

–న్యూస్‌టుడే, రంగంపేట



కాసుల పేరు హారం



లక్ష్మీ కాసుల హారం


బంగారు గాజులు


రెండు పెద్ద గాజులు


అష్టలక్ష్మి బంగారు చెంబు




పెద్ద మాంగల్యం


పెద్ద పుస్తెలు


పచ్చల హారం


చంద్ర వంక


ముక్కు పుడక


ముక్కు పోగు

## సీబీఐ అధికారినంటూ రూ.28.50 లక్షల టోకరా

**వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే:** హనుమకొండ నగరంలో ప్రముఖ పారిశ్రామికవేత్తకు సీబీఐ అధికారుల మంటూ సైబర్ నేరగాళ్లు రూ.28.50 లక్షలు టోకరా వేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 2న పారిశ్రామిక వేత్తకు గుర్తు తెలియని మహిళ ఫోన్ చేశారు. ట్రాయ్ నుంచి మాట్లాడుతున్నామని, మీ ఆధార్‌కార్డు మొబైల్‌కు లింక్ చేయలేదని చెప్పారు. రెండు గంటల్లో ఫోన్ నెంబర్ బ్లాక్ చేస్తామని, త్వరలో మా ఉన్నతాధికారులు మీతో మాట్లాడతారని చెప్పి ఫోన్ పెట్టేశారు. కొద్దిసేపటి తర్వాత మరో మహిళ ఫోన్ చేసి తాను సీబీఐ ముంబయి బ్రాంచి అధికారినంటూ పరిచయం చేసుకున్నారు. తర్వాత వాట్సప్ వీడియోకాల్ చేసి సీబీఐ కార్యాలయం మాదిరిగా ఉన్న సెట్టింగ్‌ను చూపారు. మీరు మనీ ల్యాండరింగ్‌లో పాల్గొన్నారని, మీపై సీబీఐ కేసు నమోదు చేసిందని చెప్పారు. ఎప్పుడైనా మీ వద్దకు వచ్చి మా అధికారులు అరెస్టు చేస్తారని భయాందోళనకు గురిచేశారు. నరేష్ గోయల్ అనే వ్యక్తి మీ ద్వారా సుమారు రూ.6.8 కోట్లు మనీ ల్యాండరింగ్ చేశారని, అందుకోసం మీకు రూ.18.16 లక్షల కమీషన్ ఇచ్చారని చెబుతూ.. పూర్తి వివరాలు మా వద్ద ఉన్నాయని, ఈ కేసు నుంచి మీరు తప్పించుకోలేరని బెదిరించారు. ప్రస్తుతం మీ బ్యాంకు ఖాతాలో ఉన్న డబ్బు మేం సూచించిన ఖాతాలోకి మళ్లించాలని, కేసు విచారణ పూర్తయ్యాక ఎన్‌వోసీ ధ్రువీకరణతో పాటు మీ డబ్బు అప్పగిస్తామని నమ్మించారు. వారి మాటలకు భయపడిన పారిశ్రామికవేత్త తనకు ఉన్న రెండు బ్యాంకు ఖాతాల నుంచి రూ.28.50 లక్షలు వారు చెప్పిన ఖాతాలోకి మళ్లించారు. రెండ్రోజుల తర్వాత అవతలి వ్యక్తుల నెంబరుకు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. అనుమానం వచ్చి పోలీసులను ఆశ్రయించడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

## గ్రేటర్‌లో నేడు ప్రజావాణి

**కార్పొరేషన్, న్యూస్‌టుడే:** వరంగల్ మహా నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ప్రజావాణి కార్యక్రమం ఉంటుందని కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని విభాగాల వింగ్ అధికారులు పెండింగ్, పరిష్కార వివరాలతో హాజరుకావాలని కోరారు.

## హైడ్రా బాధితులకు పరిహారం చెల్లించాలి

**వేలేరు, న్యూస్‌టుడే:** రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా బాధితులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని మాజీ మంత్రి, భాజపా నాయకుడు డాక్టర్ గుండె విజయ రామారావు డిమాండ్ చేశారు. ఆదివారం వేలేరులో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైడ్రా పేరుతో నిర్మాణాలను కూలుస్తున్న ప్రభుత్వం ముందుగా.. హైదరాబాద్ నగరం, శివారులోని చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. వారిపై కేసులు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో భాజపా మండల అధ్యక్షుడు రాజు, నాయకులు పాల్గొన్నారు.



## పద్మాక్షి గుండం పరిశుభ్రం

ఈనాడు కథనానికి స్పందన

నిండుగా గుర్రపుడెక్క పెరిగి అధ్వానంగా మారిన పద్మాక్షి గుండాన్ని ఎట్టకేలకు శుభ్రం చేశారు. హనుమకొండ పద్మాక్షి గుండం పరిస్థితిపై గత నెల 5న 'కనులకు ఇంపు.. గుండానికి ముప్పు' శీర్షికన 'ఈనాడు'లో చిత్ర కథనం ప్రచురితం అయింది. నగరపాలక సంస్థ అధికారులు స్పందించి ఆదివారం గుండంలోని పిచ్చి మొక్కలు, గుర్రపుడెక్క, వ్యర్థాలను తొలగించి శుభ్రం చేశారు. – న్యూస్‌టుడే, బాలసముద్రం

## అధ్వాన రహదారితో అవస్థలు



కమలాపూర్ మండలంలోని ఉప్పల్ ఆర్వోబీ పక్కన రైల్వే గేటు వద్ద వాహనాల రాకపోకలకు ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసిన దారి గుంతలు పడి పూర్తి అధ్వానంగా మారింది. చినుకులు పడితే నీరు నిలిచి, బురదగా మారి వాహనాలు అందులో దిగబడుతున్నాయి. రైళ్ల రాకపోకలప్పుడు గేటు వేసిన ప్రతిసారి సుమారు 30 నిమిషాల పాటు ఇరువైపులా వాహనాలు నిలిచిపోతున్నాయి. అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కమలాపూర్

## సద్దుల బతుకమ్మ..
# పనులు నామమాత్రం

● నాలుగు రోజులే గడువున్నా కనిపించని ఏర్పాట్లు
● 25 ప్రాంతాలు.. రూ.కోటి నిధులు

వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో సద్దుల బతుకమ్మ ఏర్పాట్లు మొక్కుబడిగా సాగుతున్నాయి. పండగ దగ్గర పడుతున్నా.. పనులు మాత్రం పూర్తి కావడం లేదు. గ్రేటర్ వరంగల్ పరిధిలో ప్రధానంగా 25 ప్రాంతాల్లో సద్దుల బతుకమ్మ ఏర్పాట్లు చేపట్టేందుకు ఇంజినీర్లు ప్రతిపాదించారు. బతుకమ్మ ఆడే మైదానాలు, చెరువులు, కుంటలు, దేవాలయాల స్థలాలు చదును చేయడం, చెత్తాచెదారం తొలగింపు, రహదారులపై గుంతలు పూడ్చడం, బతుకమ్మ విగ్రహాలకు రంగులు వేయడం తదితర పనులకు సుమారు రూ.65 లక్షలు కేటాయించారు. బతుకమ్మ, దసరా ఉత్సవాలు, రావణ వధ జరిగే మైదానాలు దగ్గర విద్యుద్దీపాల కోసం రూ.30-35 లక్షలు కేటాయించారు. బల్దియా సాధారణ నిధుల(జనరల్ ఫండ్స్) నుంచి సుమారు రూ. కోటి వరకు నిధులు ఖర్చు చేసేందుకు నిర్ణయించారు. కానీ మొక్కుబడి ఏర్పాట్లతో తిప్పలు తప్పేలా లేవు. – న్యూస్‌టుడే, కార్పొరేషన్, బాలసముద్రం, కాజీపేట, భీమారం, పరకాల

### వడ్డెపల్లి చెరువు కట్టపై ఏర్పాట్లు శూన్యం

వడ్డెపల్లి చెరువు సుబ్రమణ్యస్వామి ఆలయం వద్ద సద్దుల బతుకమ్మకు పెద్ద ఎత్తున మహిళలు హాజరవుతారు. ఇక్కడ బతుకమ్మ నిమజ్జన స్థలం గుర్రపు డెక్కతో నిండి ఉంది. ఇటీవల ఎమ్మెల్యే మత్స్యసహకార శాఖ ఆధ్వర్యంలో ఉచిత చేప పిల్లలను వదలడానికి వచ్చిన సందర్భంగా గుర్రపు డెక్కను కొంత వరకు తొలగించడంతో అది మళ్లీ వచ్చి చేరింది. ఏర్పాట్లపై ఉత్సవ కమిటీని వివరణ కోరగా చెరువుల్లో గుర్రపు డెక్క తొలిగించడానికి కాకతీయ పట్టణ అభివృద్ధి సంస్థ (కుడా) టెండర్లను పిలిచిందని, త్వరలో పనులు ప్రారంభిస్తారని చెప్పారు.

పరిశీలన


వడ్డెపల్లి చెరువులో బతుకమ్మ నిమజ్జనం చేసే చోట గుర్రపు డెక్క ఆకు

### సరిగమ పార్కు శుభ్రం చేస్తే ఉపయోగం..


పద్మాక్షి కాలనీలో నిరుపయోగంగా సరిగమ పార్కు స్థలం

బతుకమ్మ ముగింపు వేడుకలు హనుమకొండ పద్మాక్షి కాలనీలో వైభవంగా జరుగుతాయి. నగర నలుమూలల నుంచి మహిళలు, యువతులు వేలమంది తరలివచ్చి పద్మాక్షి గుండంలో బతుకమ్మలను నిమజ్జనం చేస్తారు. దానికి తగ్గట్టు మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో మహిళలు ఇబ్బంది పడుతున్నారు. పద్మాక్షి గుండం పక్కనే నిరుపయోగంగా ఉన్న సరిగమ పార్కును శుభ్రం చేస్తే వేలమంది మహిళలు బతుకమ్మ ఆడటానికి ఎంతో అనువుగా ఉంటుంది. ప్రస్తుతం ఈ పార్కు నిర్వహణ లేక పిచ్చిమొక్కలు పెరిగి అస్తవ్యస్తంగా ఉంది. నగరపాలక సంస్థ అధికారులు ఈ పార్కులో ఏర్పాట్లు చేయాలని మహిళలు కోరుతున్నారు.

### కానరాని చర్యలు..

సద్దుల బతుకమ్మ ఉత్సవాలు సమీపిస్తున్నా మహిళలు బతుకమ్మ ఆడే చోట అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. వేడుకకు కేవలం నాలుగు రోజులు మాత్రమే మిగిలి ఉన్నా ఎక్కడి పనులు అక్కడే నిలిచి ఉన్నాయి. హసన్‌పర్తి మండలం వంగపహాడ్, హసన్‌పర్తి, ముచ్చర్ల, నాగారం, హనుమకొండ మండలం గుండ్లసింగారం, గోపాలపూర్, వరంగల్ మండలం ఆరెపల్లి, పైడిపల్లి, కొత్తపేట ప్రాంతాల్లో బతుకమ్మ ఉత్సవాలు జరిగే స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగాయి. పైడిపల్లిలో బతుకమ్మలను నిమజ్జనం చేసే కుంటలో నీళ్లు కొద్ది ఉన్నాయి. వీధి దీపాలు, రోడ్డు చదును పనులు చేపట్టలేదు.


పైడిపల్లి శివారులో చెరువు పరిస్థితి..

### కళతప్పిన విగ్రహం

**దేశాయిపేట, కొత్తవాడ:** దేశాయిపేట చిన్నవడ్డేపల్లి చెరువులో గుర్రపు డెక్కను ఒకవైపు పూర్తిగా తొలగించారు. మరోవైపు పనులు జరుగుతున్నాయి. గతేడాది చిన్నవడ్డేపల్లి చెరువు సమీపంలోని సీకేఎం కళాశాల మైదానంలో సరిపడా విద్యుద్దీపాలు ఏర్పాటు చేయకపోవడంతో మహిళలు ఇబ్బందిపడ్డారు. కొత్తవాడ తోట మైదానంలో బతుకమ్మ విగ్రహానికి రంగులు వేయకపోవడంతో కళ తప్పింది. అక్కడక్కడ పోసిన మట్టి కుప్పలను చదును చేయాలని నగరవాసులు కోరుతున్నారు.



### నత్తనడకన పనులు..



పరకాల పురపాలికలో సద్దుల బతుకమ్మ, దసరా వేడుకలకు రూ.30 లక్షలు కేటాయించారు. పరకాల, విలీన రాజిపేట, సీతారాంపురం గ్రామాల్లో కేవలం విద్యుత్తు దీపాలకు రూ.15 లక్షలు చూపారు. మైదానాలను చదును చేసేందుకు రూ.5 లక్షలు, బారికేడ్ల ఏర్పాటుకు రూ.5 లక్షలు, అంతర్గత రహదారుల మరమ్మతులకు రూ.5 లక్షలు కేటాయించారు. పలు చోట్ల పనులు కొనసాగుతున్నాయి. పశువుల సంత ఆవరణ, దామెర చెరువు వద్ద మైదానాలను చదును చేసే పనులు చేశారు. అంతర్గత రహదారులపై స్టోన్ డస్ట్, వెట్‌మిక్స్ పోసిన దాఖలాలు లేవు. విద్యుత్తు దీపాలను అమర్చలేదు.

### పనులు పూర్తి చేయిస్తాం

**- రాజయ్య, ఎస్‌ఈ, గ్రేటర్ వరంగల్**

వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో సద్దుల బతుకమ్మ పండుగ కోసం విస్తృతమైన ఏర్పాట్లు చేస్తున్నాం. ఎక్కడైనా పనులు కాకపోతే పరిశీలించి పూర్తి చేయిస్తాం. మహిళలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

## పిడుగుపాటుతో మృత్యువాత.. కన్నతల్లుల కడుపు కోత

**ఐనవోలు, న్యూస్‌టుడే:** వారిద్దరివి వేర్వేరు కుటుంబాలు. కన్న తల్లి కష్టాన్ని పంచుకోవాలని వ్యవసాయ పొలానికి వచ్చారు. ఉదయం నుంచి పనుల్లో చేదోడుగా ఉన్నారు. సాయంత్రం పిడుగుపాటు ఆ ఇద్దరినీ కబళించింది. కళ్లెదుటే విగతజీవులుగా మారిన బిడ్డలను చూసి కన్నవారి గుండె బద్దలైంది. ఆసరాగా ఉంటారనుకున్న వారు అకాల మరణంతో ఆ ఇద్దరు తల్లులు గుండెలవిసేలా రోదించారు. ఈ ఘటన హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం వెంకటాపూర్ గ్రామంలో విషాదాన్ని నింపింది.

### ముగ్గురు కుమార్తెల తర్వాత పుట్టిన కొడుకు..

కూకట్ల ఐలయ్య-కోమల దంపతులది నిరుపేద కుటుంబం. ఉన్న ఒకటిన్నర ఎకరం పొలంలో భార్య వ్యవసాయ పనులు చేస్తుండగా.. భర్త మరో రైతు వద్ద జీతానికి కుదిరి కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ముగ్గురు కుమార్తెల తర్వాత నాలుగో సంతానంగా రాజు (25) జన్మించాడు. దీంతో తల్లిదండ్రులు, అక్కలు చిన్నప్పటి నుంచి ఎంతో ప్రేమగా చూసుకున్నారు. ముగ్గురు అక్కల పెళ్లిళ్లకు అయిన ఖర్చు, కుటుంబ ఆర్థిక ఇబ్బందులను చూసిన కుమారుడు ఇంటర్‌తో చదువు ఆపేసి వ్యవసాయ పనుల్లో అమ్మకు తోడుగా ఉంటున్నాడు. ఆదివారం అమ్మతో పాటు పొలానికి పత్తి ఏరడానికి వెళ్లాడు. సాయంత్రం మబ్బులు కమ్మేయడంతో.. అమ్మా.. వర్షమొస్తే పత్తి తడిచి పోతుంది. ఇంటిదగ్గర వేసొస్తానని సైకిల్‌పై బయలుదేరిన కుమారుడు పదడుగులైనా వేయలేదు. చినుకులు మొదలు కావడంతో సమీపంలోనే ఉన్న షెడ్డు కిందకు చేరాడు.. అంతలోనే పిడుగుపాటుకు కళ్లెదుటే అసువులు బాయడంతో తల్లి కోమల వేదన అంతాఇంతా కాదు.

### సెలవుల్లో అమ్మకు అండగా ఉంటూ..

దౌత్‌బాజీ రాంబాబు-రాధాబాయి దంపతులకు కుమారుడు, కుమార్తె సంతానం. మూడేళ్ల కిందటే భర్త అకాల మరణం చెందడంతో భార్య ఇద్దరు పిల్లలపై ఆశలు పెట్టుకొని జీవిస్తోంది. వారికున్న రెండున్నర ఎకరాల వ్యవసాయ పొలంలో పంటలు పండిస్తూ పిల్లలను పోషిస్తోంది. కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా కుమారుడు ఇంటర్‌తోనే చదువు ఆపేసి పొలం పనులు చూసుకుంటున్నాడు. చిన్నప్పటి నుంచి చదువులో చురుగ్గా ఉన్న కుమార్తె శావణి (17) ప్రస్తుతం జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. సెలవుల్లో తల్లికి పొలం పనుల్లో అండగా ఉండేది. ప్రస్తుతం దసరా సెలవులకు ఇంటికి వచ్చిన శ్రావణి ఆదివారం పొలానికి వచ్చి కళ్లెదుటే పిడుగుపాటుకు గురై ప్రాణాలు వదలడంతో తల్లి రాధాబాయి గుండెలు బాదుకొంది. మూడేళ్ల కిందట భర్త, ఇప్పుడు కుమార్తె అకాల మరణంతో కన్నీరుమున్నీరుగా రోదించింది.


శ్రావణి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు


రాజు మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి కోమల

## ఏడుగురు ఇన్‌స్పెక్టర్ల బదిలీ



**వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే:** వరంగల్ పోలీసు కమిషనరేట్‌లోని వివిధ ఠాణాల్లో పనిచేస్తున్న ఏడుగురు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ సీపీ అంబర్ కిషోర్ ఝా ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఇంతేజార్‌గంజ్ నుంచి బదిలీ అయినా ఎవరికీ పోస్టింగ్ ఇవ్వలేదు. పది రోజుల క్రితం మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ మల్లయ్యను ఐజీకి అటాచ్ చేశారు. అక్కడ కూడా ఇప్పటి వరకు పోస్టింగ్ ఇవ్వలేదు.

| పేరు | ప్రస్తుత స్థానం | బదిలీస్థానం |
|---|---|---|
| ఎ.మహేందర్ | సీసీఎస్ | గీసుగొండ |
| జి.బాబులాల్ | గీసుగొండ | టాస్క్‌ఫోర్స్ |
| ఎస్.రవికుమార్ | టాస్క్‌ఫోర్స్ | కేయూసీ |
| బి.సంజీవ్ | కేయూసీ | ఎస్‌బీ వరంగల్ |
| ఒ.రమేష్ | సీసీఎస్ | మామునూరు |
| ఎం.రవికుమార్ | మామునూరు | ఐజీ అటాచ్ |
| ఎం.శివకుమార్ | ఇంతేజార్‌గంజ్ | సీసీఎస్ |

# పండగ వేళ.. ట్రాఫిక్ పద్మవ్యూహం

● సిబ్బంది లేక ఇబ్బందులు



కాజీపేట బ్రిడ్జి వద్ద వాహనాల రద్దీ.. ఇక్కడ రైల్వే వంతెన ఒకటే ఉండడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. అసంపూర్తిగా ఉన్న మరో రైల్వే వంతెన పూర్తి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వరంగల్ క్రైం, న్యూస్‌టుడే

దేవీ నవరాత్రి ఉత్సవాలు, దసరా పండగను పురస్కరించుకొని వరంగల్ నగరంలో ట్రాఫిక్ రద్దీ విపరీతంగా పెరిగింది. పండగ సామగ్రి, దుస్తుల కొనుగోళ్లకు ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి తరలివస్తున్న ప్రజలతో మార్కెట్ రోడ్లన్నీ కిక్కిరిసి పోతున్నాయి. కాజీపేట నుంచి వరంగల్, కరీంనగర్ రహదారిలో వాహనాల సంఖ్య అధికంగా ఉంటోంది. దీంతో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు నెలకొంటున్నాయి. పండగ రద్దీ నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు, నగరవాసులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కథనం..

● ప్రతినెలా 4 వేల వరకు కొత్త వాహనాలు రిజిస్ట్రేషన్ అవుతున్నాయి.



తిరుమల జంక్షన్‌లో..





### ఇదీ పరిష్కారం..

● రోడ్లు ఇరుకుగా ఉండి జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వన్‌వేలను ఏర్పాటు చేయాలి.

● సిగ్నల్స్ వద్ద ఫ్రీ లెఫ్ట్ ఉండేలా చర్యలు తీసుకోవాలి.

● ఉదయం, సాయంత్రం కళాశాలలు, పాఠశాలల సమయంలో అదనంగా సిబ్బందిని నియమించి ట్రాఫిక్‌ను నియంత్రించాలి.

● రద్దీని బట్టి ట్రాఫిక్ కూడళ్ల వద్ద అదనంగా సిబ్బందిని కేటాయించాలి.

### రోడ్లపై 2 లక్షలకు పైగా వాహనాలు..

● పోలీసు శాఖ లెక్కల ప్రకారం కమిషనరేట్ పరిధిలోని వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల్లో రెండు, నాలుగు చక్రాలు, భారీ వాహనాలు కలిపి సుమారు 4.50 లక్షల వరకు ఉంటాయి. ప్రతి రోజు ఇతర ప్రాంతాల నుంచి లక్ష వరకు వాహనాలు నగరానికి వచ్చి వెళ్తుంటాయి. అన్ని కలిపి నగరంలో రోజుకు 2 లక్షలకు పైగా వాహనాలు తిరుగుతుంటాయని పోలీసుల అంచనా. పండగల వేళ మరో 20 వేలు అధికంగా తిరుగుతుంటాయి.

### ఇదీ పరిస్థితి..

పెరిగిన ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు ప్రస్తుతం నగరంలోని మూడు ట్రాఫిక్ ఠాణాలోని సిబ్బంది సరిపోవడం లేదు. ఏఆర్ విభాగం నుంచి కొందరిని కేటాయించారు. అయినప్పటికీ కాజీపేట ఫాతిమా నగర్ బ్రిడ్జి, పెట్రోల్‌పంపు, లష్కర్‌బజార్, హనుమకొండ చౌరస్తా, ఎన్‌జీవోస్ కాలనీ రోడ్డు, నయీంనగర్, వరంగల్ పోచమ్మ మైదానం, వరంగల్ చౌరస్తా, హెడ్ పోస్టాఫీస్, ఎస్‌వీఎన్ రోడ్డు ప్రాంతాల్లో నిత్యం ట్రాఫిక్ జామ్ కావడంతో పాటుగా రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని ప్రజలు కోరుతున్నారు.

● పదేళ్లలో నగరంలో వాహనాల సంఖ్య వంద శాతం పెరిగింది. ఆ స్థాయిలో రహదారుల విస్తరణ జరగలేదు. దీంతో నిత్యం ట్రాఫిక్ సమస్య ఉంటుంది. పండగల సమయంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం సిబ్బందిని పెంచాలి.

### ట్రాఫిక్ ఉల్లంఘనలపై చలాన్లు ఇలా..

నగరంలో మూడు ట్రాఫిక్ ఠాణా పరిధిలో ఈఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు విధించిన ట్రాఫిక్ చలాన్లు కేసుల నమోదు

| ఉల్లంఘనలు | కేసుల సంఖ్య | జరిమానా (రూ.లలో) |
|---|---|---|
| హెల్మెట్ లేకుండా చలాన్లు | 2,56,767 | 4,24,71,300 |
| రాంగ్ రూట్ డ్రైవింగ్ | 11,531 | 22,92,400 |
| ట్రిపుల్ రైడింగ్ | 10,261 | 1,19,91,600 |
| చరవాణి మాట్లాడుతూ డ్రైవింగ్ | 6004 | 59,58,000 |



వరంగల్ చౌరస్తాలో అన్ని వైపులకు ఒకరే ట్రాఫిక్ పోలీసు..

### సిబ్బంది సంఖ్య పెరగాలి..

ప్రస్తుతం వరంగల్ కమిషనరేట్ పరిధిలో 14 నుంచి 16 కిలోమీటర్ల వరకు ట్రాఫిక్ రద్దీ ఉంటుంది. ఇన్ని కిలోమీటర్ల దూరం ట్రాఫిక్ క్రమబద్ధీకరించాలంటే సుమారు 400లకు పైగా సిబ్బంది అవసరం.

● ప్రస్తుతం 140 మంది ట్రాఫిక్ సిబ్బంది, 100 మంది హోంగార్డులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. గతంలో కంటే ట్రాఫిక్ నియంత్రణ పాయింట్లు పెరిగాయి. నగర శివారులతో కలిపి మొత్తం 51 ట్రాఫిక్ పాయింట్లు, 11 సిగ్నల్స్ ఉన్నాయి.

● నగరంలో మూడు ట్రాఫిక్ ఠాణాలు మాత్రమే ఉన్నాయి. మరో మూడు అవసరం ఉంది.

### పార్కింగ్‌తో సమస్య..

నగరంలో పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్ వచ్చాయి. వీటిలో షాపింగ్ చేసేందుకు వచ్చే ప్రజలు వాహనాలను రోడ్డుపై నిలుపుతున్నారు.

**ఇలా చేద్దాం:** షాపింగ్ మాల్స్ ఆవరణలోని సెల్లార్లల్లో వాహనాలను పార్కింగ్ చేయాలి.

● వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించాలి. రాంగ్ రూట్‌లో రావడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీని వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. సిగ్నల్స్‌ను పట్టించుకోకుండా ముందుకు వెళ్లడంతో ఇతర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

● వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటిస్తే ఇబ్బందులు ఉండవని ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ తెలిపారు.

## మహాలక్ష్మీ.. కరుణించు తల్లీ!



**రంగంపేట, న్యూస్‌టుడే:** సిరి సంపదలివ్వమ్మా శ్రీమహాలక్ష్మీ అంటూ భక్తులు వేడుకున్నారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగోరోజు ఆదివారం భద్రకాళి అమ్మవారు మహాలక్ష్మీగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నిత్యాహ్నికం, సాయంత్రం గిరిజా దుర్గార్చన పూజారాధనలు జరిపారు. ఉదయం 11 గంటలకు సూర్యప్రభ వాహనం, సాయంత్రం హంస వాహన సేవలు నిర్వహించారు. రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ సిరిసిల్ల రాజయ్య తదితర ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు.

## అందరూ ముఖ్యులే.. సాధారణ భక్తులకు అవస్థలు!



అమ్మవారి దర్శనానికి వరుసలో ఉన్న సాధారణ భక్తులు



వీఐపీ ద్వారం వద్ద రద్దీ

**రంగంపేట, న్యూస్‌టుడే:** శరన్నవరాత్రి ఉత్సవాల వేళ భక్తులు భద్రకాళి ఆలయానికి పోటెత్తుతున్నారు. రద్దీకి అనుగుణంగా దేవస్థానం అధికారులు, ఉద్యోగులు తగిన ఏర్పాట్లు చేయడం లేదు. ఆదివారం అమ్మవారిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు వచ్చారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో దాదాపు 2-3 గంటల పాటు అన్ని క్యూలైన్లలో సాధారణ భక్తులు బారులుతీరారు. వీళ్లను అలాగే వదిలేసి వీఐపీ(అత్యంత ముఖ్యమైన వ్యక్తి) ద్వారంలో నుంచి వందలాది మందిని ఒకేసారి లోనికి పంపించడంతో గందరగోళం నెలకొంది. కొందరు ప్రైవేటు వ్యక్తులు, అర్చకులు బంధువులు, స్నేహితులను వీఐపీ మార్గం గుండా తీసుకెళ్లారు. గంటల తరబడి సాధారణ భక్తులు క్యూలైన్లలో విలవిల్లాడారు. తాగునీటి కోసం అల్లాడారు. రద్దీని కట్టడి చేసేందుకు వెళ్లిన ఈవో శేషుభారతి సైతం అందులో ఇరుక్కుపోయారు. సాధారణ భక్తులను వదిలేసి వీఐపీ మార్గానికే ప్రాధాన్యం ఇచ్చారని భక్తులు నిలదీశారు.

**ప్రైవేటు పెత్తనం..:** భద్రకాళి ఆలయంలో ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల పేరుతో పలువురు.. మాజీ ధర్మకర్తలు, దాతల పేరుతో కొంతమంది ప్రైవేటు వ్యక్తులు పెత్తనం చెలాయిస్తున్నారు. వీఐపీ క్యూలైన్ వద్ద వారిదే హవా నడుస్తోంది. కొందరు అర్చకులు సైతం అతిగా వ్యవహరిస్తున్నారు. అడ్డదారిలో భక్తులను గర్భాలయంలోకి తీసుకెళ్తున్నారు.

## తెల్లబంగారం.. అన్నింటికీ ఆధారం

### నేడు ప్రపంచ పత్తి దినోత్సవం

ఉమ్మడి వరంగల్‌వ్యాప్తంగా రైతులు పండించే ప్రధాన పంట పత్తి.. ఇది వారికి ముఖ్యమైన ఆదాయ వనరు. సోమవారం ప్రపంచ పత్తి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ పంట ప్రధాన్యం, ఉపాధి అవకాశాలపై ప్రత్యేక కథనం..

ఎనుమాముల మార్కెట్, న్యూస్‌టుడే

పత్తి ప్రాధాన్యం.. ప్రాముఖ్యాన్ని గుర్తించడంతో పాటు పత్తిపై అవగాహన పెంచేందుకు, సాగును ప్రోత్సహించడమే లక్ష్యంగా ఏటా అక్టోబరు 7న ప్రపంచ పత్తి దినోత్సవం నిర్వహిస్తున్నారు.

ఈ ఏడాది పత్తి దినోత్సవం ఉద్దేశం 'కాటన్ ఫర్ గుడ్'. దీనిని ప్రపంచ వాణిజ్య సంస్థ, యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్ ఆన్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్, ఇంటర్నేషనల్ ట్రేడ్ సెంటర్ సంయుక్తంగా నిర్ణయించారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 5,13,289 ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేయగా.. 4,10,632 మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు.



#### మీకు తెలుసా..

● ప్రపంచ దేశాలతో పోలిస్తే మనదేశం 40 శాతం తెల్లబంగారాన్ని పండిస్తోంది.

● ప్రపంచ వ్యాప్తంగా పత్తిని వాణిజ్య పంటగానే కాకుండా ఆహార, చమురు పంటగా గుర్తిస్తున్నారు. పత్తి గింజలను వంట నూనెగా, గింజల చెక్కను పశు దాణాగా వాడుతున్నారు. కొన్ని దేశాల్లో గింజల నూనెను జీవ ఇంధనం తయారీకి వినియోగిస్తున్నారు.

● పత్తి తన సొంత బరువు కన్నా 27 రెట్లు నీటిని గ్రహించగలదు. దాంతో కావాల్సిన సాంద్రతతో వస్త్రాలను నేయవచ్చు. నాణ్యత కాటన్ ఫ్యాబ్రిక్‌కు సులభంగా రంగులు వేసేందుకు వీలుగా ఉంటుంది.

● ఓ జీన్స్ తయారీకి 0.68 కిలోలు, చొక్కాకు 0.28 కిలోలు, టీషర్టుకి 0.23 కిలోలు, డైపర్ తయారీకి 0.07 కిలోలు, టవల్‌కు 0.28 కిలోలు పత్తి అవసరమని అంచనా.

#### ఏడాది పొడవునా ఉపాధి..

అంతర్జాతీయ పత్తి సలహా కమిటీ(ఐసీఏసీ) అంచనా ప్రకారం.. రైతు పండించిన ఓ టన్ను పత్తి అయిదుగురికి ఏడాది పొడువునా ఉపాధి కల్పిస్తోంది. వైద్య రంగం, పశుగ్రాసం, వంటనూనె పరిశ్రమలతో పాటు వస్త్ర పరిశ్రమలకు ఇది ముడి సరకు. వ్యవసాయం, తయారీ, రిటైల్ రంగాల్లో ఉద్యోగాలను సృష్టిస్తోంది. ఉమ్మడి జిల్లాలో ప్రత్యక్షంగా 10 వేల మందికి, పరోక్షంగా 20 వేల మందికి పైగా పత్తి పరిశ్రమ ఉపాధి కల్పిస్తుంది. రైతులు, కూలీలతో పాటు వ్యాపారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులు, ఫిట్టర్లు, ప్రెస్సింగ్, జిన్నింగ్ ఆపరేటర్లు, హమాలీలు, మార్కెటింగ్‌శాఖ, వస్త్ర పరిశ్రమ, తదితర అనుబంధ రంగాల్లో పనిచేస్తున్న వారికి ఉపాధి లభిస్తోంది.

● ఉమ్మడి జిల్లాలో మొత్తం 55 జిన్నింగ్ మిల్లులుండగా.. ఒక్కో మిల్లులో సుమారు 150 మంది పనిచేస్తూ.. తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు.



హనుమకొండ జిల్లా ఆత్మకూరులో పత్తి తీస్తున్న మహిళా కూలీ (పాతచిత్రం)

#### రంగురంగుల్లో.. పంట

పత్తి అనగానే మనకు తెల్లని దూది మాత్రమే స్ఫురిస్తుంది. ఆ దూదిని రంగురంగుల్లో పండించేందుకు పరిశోధకులు ప్రయత్నిస్తున్నారు. నాగపూర్‌లోని ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చర్ రిసెర్చ్ సంస్థ, దార్వాడలోని అగ్రికల్చరల్ సైన్సెస్ యూనివర్సిటీలకు చెందిన నిపుణులు రంగుల పత్తి వంగడాలను సృష్టించి, ఏడేళ్లుగా వివిధ ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా పండిస్తున్నారు. సహజసిద్ధంగా పత్తికి రంగు రావడంతో.. అదనంగా పత్తి దారాలకు రంగు నీళ్లలో ముంచాల్సిన అవసరం ఉండదు. దాంతో జల కాలుష్యాన్ని తగ్గించవచ్చని పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు.



#### వివిధ ప్రాంతాలకు ఎగుమతి..

ఉమ్మడి వరంగల్‌లో పండిన పత్తిని వ్యాపారులు వివిధ ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. ఇక్కడి నుంచి స్పిన్నింగ్ చేసిన దూది బేళ్లు ఆంధ్రప్రదేశ్, గుజరాత్, తమిళనాడు రాష్ట్రాలతో పాటు బంగ్లాదేశ్, వియత్నాం, చైనా దేశాలకు ఎగుమతి అవుతుంది. పత్తి నుంచి వేరుచేసిన గింజలను వంట నూనె, పశువుల దాణా తయారీ కోసం హరియాణా, పంజాబ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు వ్యాపారులు ఎగుమతి చేస్తుంటారు.

#### పత్తి ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

**- బొమ్మినేని రవీందర్‌రెడ్డి, పత్తి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు**

రాష్ట్రంలో పత్తి ఆధారిత, అనుబంధ పరిశ్రమలు లేకపోవడంతో ఇక్కడ పండిన దిగుబడులు ఇతర రాష్ట్రాలు, దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. పరిశ్రమల ఏర్పాటుతో ఇక్కడి యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడటంతో పాటు రవాణా భారం తగ్గుతుంది. యూరియా సంచుల్లో రైతులు పత్తిని తీసుకురావడం వల్ల తెల్లని ప్లాస్టిక్ వ్యర్థాలు పత్తిలో కలిసిపోతున్నాయి. స్పిన్నింగ్ మిల్లులు అలాంటి పత్తిని తిరస్కరిస్తున్నాయి. ప్రభుత్వం యూరియా బస్తాల రంగును మార్చడం ద్వారా ఈ సమస్య పరిష్కరించవచ్చు.

#### ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది వివరాలు

● పత్తి సాగు (ఎకరాల్లో) ● దిగుబడి అంచనా (మెట్రిక్ టన్నుల్లో)

| జిల్లా | పత్తి సాగు (ఎకరాల్లో) | దిగుబడి అంచనా (మెట్రిక్ టన్నుల్లో) |
|---|---|---|
| వరంగల్ | 1,20,037 | 96,030 |
| హనుమకొండ | 77,330 | 61,864 |
| ములుగు | 21,114 | 16,891 |
| జనగామ | 1,25,195 | 1,00,156 |
| భూపాలపల్లి | 91,281 | 73,025 |
| మహబూబాబాద్ | 78,332 | 62,666 |

## పవర్ లిఫ్టింగ్‌లో రజత పతకం



సాధించిన పతకంతో సుకన్య

**సీరోలు(కురవి), న్యూస్‌టుడే:** మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలం రేకుల తండా గ్రామపంచాయతీ శివారు జగ్యాతండాకు చెందిన తేజావత్ సుకన్య కామన్‌వెల్త్ పవర్‌లిఫ్టింగ్ ఫెడరేషన్ పోటీల్లో రజత పతకం సాధించారు. మారుమూల గిరిజన తండాలోని మధ్య తరగతి గిరిజన కుటుంబంలో జన్మించిన ఆమె క్రీడల్లో రాణించాలనే తపనతో ముందుకు సాగుతున్నారు. డిగ్రీ వరకు చదువుకున్న ఆమె తొలుతగా వెయిట్ లిఫ్టింగ్‌తో ప్రారంభించి అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకాలు పొందారు. 2024 జూన్‌లో దక్షిణ ఆఫ్రికా దేశంలో పవర్‌లిఫ్టింగ్‌లో రాణించి పతకం సాధించారు. ఈనెల 4 నుంచి దక్షణాఫ్రికా దేశంలోని సన్‌సిటీలో జరుగుతున్న పోటీల్లో శనివారం రాత్రి జరిగిన బాలికల విభాగం పవర్‌లిఫ్టింగ్‌లో 76 కిలోల బరువు ఎత్తి రెండో స్థానంలో నిలిచి రజత పతకం దక్కించుకున్నారు. తండ్రి లక్ష్మణ్ ఇల్లందులో సింగరేణి ఉద్యోగం చేస్తున్న క్రమంలో తల్లిదండ్రులతో కలిసి రోజు ఉదయం వాకింగ్‌కు వెళ్లేవారు. అక్కడ కొంత మంది వెయిట్‌లిఫ్టింగ్ సాధన చేస్తుండగా వారితోపాటు సుకన్య చేసేవారు. ఆసక్తి పెరగడంతో అక్కడి నుంచి హైదరాబాద్‌కు వెళ్లి శిక్షణ పొంది జిల్లా స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయిలో బంగారు, వెండి పతకాలు సాధించారు. దక్షిణ ఆఫ్రికాకు వెళ్లేందుకు సహకరించిన గ్రీన్‌కో సంస్థ గ్రూపు ఛైర్మన్ అనీల్‌కుమార్‌శెట్టికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

## పిడుగుపాటుతో ఒకరికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న ఆర్.సింగారం రఘు

**నెల్లికుదురు, న్యూస్‌టుడే:** పిడుగుపడి ప్రైవేటు కంపెనీలోని ఇంజినీరింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని నర్సింహులగూడెంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగ్‌పూర్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి వరకు గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణ పనులు కొనసాగిస్తున్నారు. నిర్మాణ సామగ్రి సంబంధిత ఉద్యోగులు, సిబ్బంది నివాసం కోసం ఆలేరు, నర్సింహులగూడెం గ్రామాల పరిధిలో క్యాంప్ ఏర్పాటు చేశారు. తమిళనాడు రాష్ట్రం వెల్లూరు జిల్లా తిరుపత్తూరు, పెరియార్‌కొట్టం ప్రాంతానికి చెందిన ఇంజినీరు ఆర్. సింగారం రఘు మూడు నెలల నుంచి పనిచేస్తున్నారు. ఆదివారం క్యాంప్ కార్యాలయం ఆరుబయట చరవాణిలో మాట్లాడుతున్నారు. అకస్మాత్తుగా పిడుగు పడటంతో ఆయన తీవ్రంగా గాయపడగా అక్కడ ఉన్న వారు సీపీఆర్ చేసి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

## నేడు, రేపు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

**వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే:** 10వ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ నెల 7, 8 తేదీల్లో నిర్వహించనున్నట్లు రాష్ట్ర, హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి సారంగపాణి తెలిపారు. అండర్-14, 16, 18, 20 విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాలు, 10 క్రీడా పాఠశాలల నుంచి అథ్లెట్లు హాజరవుతారన్నారు. ముఖ్య అతిథిగా పారా ఒలింపియన్ జీవాంజి దీప్తి, ఇతర జాతీయస్థాయి అథ్లెట్లు, ముగింపు వేడుకలకు ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేశ్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

## తెలంగాణ ఉద్యమ చరిత్రను రికార్డు చేయాలి



సదస్సులో ప్రసంగిస్తున్న కోదండరాం, వేదికపై అంబటి శ్రీనివాస్, కేయూ ప్రొఫెసర్ వెంకటనారాయణ తదితరులు

**నర్సంపేట, న్యూస్‌టుడే:** భావితరాలకు తెలిసేలా తెలంగాణ ఉద్యమాన్ని రికార్డు చేయాలని ఎమ్మెల్సీ, తెజస వ్యవస్థాపక అధ్యక్షుడు కోదండరాం ప్రభుత్వాన్ని కోరారు. ఈ చరిత్రను మరుగున పడేసేందుకు కొందరు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. తెలంగాణ ఐకాస నర్సంపేట డివిజన్ కమిటీ, తెజస ఆధ్వర్యంలో ఆదివారం వరంగల్ జిల్లా నర్సంపేటలో వేడుకల మందిరంలో నిర్వహించిన జిల్లాస్థాయి తెలంగాణ ఉద్యమకారుల సదస్సులో కోదండరాం మాట్లాడారు. స్వయంపాలన కోసం అరవై ఏళ్లుగా ఎన్నో సంఘాలు, ఎందరో చేసిన పోరాటం, 1200 మంది ప్రాణత్యాగాలతో ప్రత్యేక రాష్ట్రం కల సాకారమైందన్నారు. గత ప్రభుత్వంలో మాదిరిగా నిర్బంధాలు, ఫోన్‌ట్యాపింగ్, అక్రమ అరెస్టులు లేవని, ప్రజాస్వామిక తెలంగాణ నిర్మాణానికి పాటుపడదామన్నారు. అమరుల కుటుంబాలకు పింఛన్లు, ఇళ్ల స్థలాలు, గుర్తింపు కార్డులిచ్చి వారి సంక్షేమానికి కృషి చేయాలన్నారు. స్థానిక అయ్యప్పస్వామి ఆలయం వద్ద కోదండరాంకు స్థానికులు స్వాగతం పలికారు. అమరవీరుల స్తూపం, చాకలి ఐలమ్మ, అంబేడ్కర్, వడ్డెర జాతి నాయకుడు ఓబలన్న విగ్రహాలకు ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెజస రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ మాట్లాడుతూ రెండు నెలల్లో తెలంగాణ ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించకపోతే మరో ఉద్యమం తప్పదన్నారు. కేయూ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ ప్రసంగిస్తూ గత పదేళ్లలో తెలంగాణ వనరులను దోపిడీ చేసిన దొంగలు పది నెలల్లో ఏదో జరిగినట్లు రచ్చ చేస్తున్నారన్నారు. ఈ సర్కార్‌ను కాపాడుకోవాలన్నారు. కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సదస్సులో నిట్ ప్రొఫెసర్ రమ, ఉద్యమకారులు, ప్రజా సంఘాల, ఐకాస నాయకులు రామ్మూర్తి, జావిద్, అరుణ, ఖాలీ సయ్యద్, అరుణ, డాక్టర్ జగదీశ్వర్, రమాదేవి పాల్గొన్నారు. వివిధ సంఘాల నాయకులు కోదండరాంకు వినతి పత్రాలు సమర్పించారు.

### చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

| | |
|---|---|
| ఫాం: | 114 |
| రిటైల్: | 136 |
| డ్రెస్డ్: | 197 |
| స్కిన్‌లెస్: | 224 |

## పంచాయతీ భవనాలకు మోక్షమెప్పుడో!


పెద్దకోడెపాకలో భవన నిర్మాణానికి వేసిన శిలాఫలకం

**శాయంపేట(పరకాల), న్యూస్‌టుడే:** శాయంపేట మండలంలో పలు పంచాయతీ కార్యాలయాల భవనాలు శిథిలావస్థకు చేరాయి. మండలంలో 24 పంచాయతీలు ఉండగా.. పెద్దకోడెపాక, నర్సింహులపల్లె, సూరంపేట, శాయంపేట, అప్పయ్యపల్లె, నూర్జహాన్‌పల్లి, కాట్రపల్లి, సాధన్‌పల్లి, సూర్యానాయక్‌తండా పంచాయతీల్లో భవనాల నిర్మాణానికి ఉపాధి హామీ పథకంలో భాగంగా రూ.20 లక్షల చొప్పున నిధులు కేటాయించారు. గత ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కానీ నిర్మాణ పనులను ప్రారంభించలేదు. పెద్దకోడెపాకలో ఏడాదిన్నర క్రితం పాత భవనాన్ని కూల్చివేసి కొత్త భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నేటికీ పనులను మొదలు పెట్టలేదు. ప్రస్తుతం ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం భవనంలో పంచాయతీ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ కార్యాలయాల భవనాల నిర్మాణ పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## వ్యాఖ్యాతల సంఘం ఎన్నిక

**బాలసముద్రం, న్యూస్‌టుడే :** ఆకాశవాణి వరంగల్ జిల్లా వ్యాఖ్యాతల సంఘం కొత్త కార్యవర్గాన్ని ఆదివారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మోటె చిరంజీవి, ప్రధాన కార్యదర్శిగా అర్షం సదానందం, కోశాధికారిగా పి.శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా గాదె శ్యామ్, బి.చైతన్య, సి.స్వప్న, సహాయ కార్యదర్శులుగా ఎం.స్రవంతి, కె.రామకృష్ణ చారి, గౌరవ అధ్యక్షుడిగా పల్లె నాగేశ్వర్‌రావు, గౌరవ సలహాదారులుగా పి.ఎల్లయ్య, ముగ్దుం, వాణి శ్రీకృష్ణ, డి.చంద్రశేఖర్‌రావు, ప్రచార కార్యదర్శులుగా ఎస్.కిషోర్, జి.శోభారాణి, సాంస్కృతిక కార్యదర్శులుగా బి.సుమలత, జె.శ్రీనివాస్, సమన్వయకర్తలుగా కె.భాగ్య, జి.వాణి, కార్యవర్గ సభ్యులుగా ఎం.శ్యామల, జి.స్వాతి, సంధ్యారాణి, సతీష్ ఎన్నికయ్యారు. పరిశీలకులుగా పసుల ఎల్లయ్య వ్యవహరించారు.


కేయూ మైదానంలో..


కొత్తకొండలో బతుకమ్మతో మంత్రి పొన్నం ప్రభాకర్ సతీమణి మంజుల

## ఉత్సాహంగా బతుకమ్మ వేడుకలు

జిల్లాలో ఆదివారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళలు, యువతులు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు. ఆట పాటలతో సందడి చేశారు. కొత్తకొండలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పొన్నం సతీమణి మంజుల పాల్గొన్నారు.

–న్యూస్‌టుడే బృందం


హనుమకొండ భారాస కార్యాలయంలో దాస్యం వినయ్‌భాస్కర్-రేవతి దంపతులు



స్పందనకు వందనం

### వీధి దీపాలు వెలిగాయి..

**జులైవాడ, న్యూస్‌టుడే :** నగరంలోని లష్కర్ సింగారం వీధి దీపం కొంత కాలంగా వెలగడం లేదని కాలనీకి చెందిన సాబీర్‌ఖాన్ 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలిపారు. విషయాన్ని నగరపాలక సంస్థ ఏఈ సంతోష్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించి వీధి దీపాలను ఏర్పాటు చేయించారు.

**సుబేదారి, న్యూస్‌టుడే :** నగరంలోని వడ్డేపల్లి పింగిళి కళాశాల ప్రాంతంలో వీధి దీపాలు వెలగడం లేదు. ఆ ప్రాంతం రాత్రి వేళ అంధకారంగా ఉంటోందని స్థానికులు అశోక్ ఇటీవల 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలిపారు. సమస్యను నగరపాలక సంస్థ ఏఈ సరిత దృష్టికి తీసుకెళ్లి, ఈనాడులో ప్రచురించగా ఆమె స్పందించి వీధి దీపాలు ఏర్పాటు చేయించారు.

### చెత్తకుప్పల తొలగింపు..

**హనుమకొండ కలెక్టరేట్:** నగరంలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో రోడ్లకు ఇరువైపులా చెత్త కుప్పలు ఉన్నాయని వాటిని తొలగించాలని కాలనీకి చెందిన రాజేందర్ 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలిపారు. విషయాన్ని ఆ ప్రాంత నగరపాలక సంస్థ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నిరంజన్‌కు తెలపగా స్పందించి వాటిని తొలగించి, శుభ్రం చేయించారు.

### పిచ్చి మొక్కలు..

**హసన్‌పర్తి, న్యూస్‌టుడే:** మండలంలోని భీమారం పాత వాడ కాలనీలో రోడ్లకు ఇరువైపులా గడ్డి, పిచ్చిమొక్కలు పెరిగి, పాములు సంచరిస్తున్నాయని స్థానికురాలు జానకి 'మేమున్నాం.. మీకుతోడుగా'కు తెలిపారు. విషయాన్ని జవాన్ రేణుకుంట సురేశ్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించారు. పారిశుద్ధ్య కార్మికులతో గడ్డి, పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేయించారు.

### మురుగు కాలువలు శుభ్రం..

**సుబేదారి, న్యూస్‌టుడే :** నగరంలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో మురుగు కాల్వలు శుభ్రం చేయడం లేదని, కాల్వలన్నీ పేరుకుపోయి దుర్వాసన వస్తోందని ఇటీవల కాలనీకి చెందిన సుధాకర్ 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలిపారు. సమస్యను శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాషా దృష్టికి తీసుకెళ్లగా స్పందించి పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి కాల్వలను శుభ్రం చేయించారు.


కాజీపేట రహమత్‌నగర్‌లో..


కొత్తకొండలో మహాలక్ష్మి అవతారంలో భద్రకాళి అమ్మవారు


పరకాల కనకదుర్గ ఆలయంలో...

## సిరులు కురిపించు శ్రీమహాలక్ష్మి


శాయంపేట మండలం కొప్పులలో...


దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు జిల్లాలో వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయాలు, మండపాల్లో కొలువుంచిన అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేస్తున్నారు. ఆదివారం పలుచోట్ల అమ్మవారు భక్తులకు మహాలక్ష్మిగా దర్శనమిచ్చారు. పరకాలలో లలిత త్రిపురసుందరిగా అలంకరించారు. మండపాల వద్ద నిర్వాహకులు అన్నదానాలు చేశారు.

– న్యూస్‌టుడే బృందం


హనుమకొండ కుమార్‌పల్లిలో..


దామెరలో..

## ప్రతిభావంతులకు ఆర్థిక సాయం


విద్యార్థికి చెక్కు అందిస్తున్న యూఎస్సీ కోశాధికారి రమణ గుప్తా

**కాజీపేట(ఫాతిమానగర్), న్యూస్‌టుడే:** బాలవికాస అనుబంధ సంస్థ అర్బన్ సాలిడారిటీ క్లబ్ (యూఎస్సీ), కెనడాకు చెందిన సోఫార్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన 102 మంది ప్రతిభ గల విద్యార్థులకు ఆర్థిక సాయం అందించారు. ఆదివారం ఫాతిమానగర్‌లోని బాలవికాస కేంద్రంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సింగారెడ్డి శౌరిరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. వివిధ తరగతుల్లో 85 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించిన పేద విద్యార్థులను ఎంపిక చేసి ఒక్కొక్కరికి రూ.7 వేల చొప్పున చెక్కులు అందించారు. ఈ సందర్భంగా యూఎస్సీ కోశాధికారి రమణ గుప్తా మాట్లాడుతూ.. విద్యకు మించిన ఆస్తి లేదని, ప్రతి ఒక్కరూ ఉన్నత చదువులు చదువుకోవాలని ఆకాంక్షించారు. బాలవికాస వ్యవస్థాపకురాలు బాలథెరిసా జింగ్రాస్, దాతలు రఘురాంరెడ్డి, ఎంఎన్.వెంకటేశ్వరరావు, బీవీ సురేష్ కుమార్, మహేశ్వర్‌రెడ్డి, అప్పారావు పాల్గొన్నారు.

## రుద్రేశ్వరాలయంలో మహాచండీ యాగం



**హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే :** చారిత్రక రుద్రేశ్వర వేయిస్తంభాల ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో రుద్రేశ్వరీదేవి మహాలక్ష్మిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం కమల పుష్ప వాహనంపై ఊరేగించారు. సర్వగ్రహ దోష నివారణ కోసం మహాచండీ యాగం నిర్వహించారు. సాయంత్రం వివిధ నృత్య శిక్షణ సంస్థలకు చెందిన చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.

## తల్లిదండ్రుల సేవ మన బాధ్యత


వృద్ధుల దినోత్సవంలో ప్రసంగిస్తున్న ఎంపీ కడియం కావ్య

**కాజీపేట టౌన్, న్యూస్‌టుడే:** తల్లిదండ్రులను భారంగా భావించకుండా, వారికి సేవలందించడం మన బాధ్యత అని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కాజీపేట సీఎస్ఐ చర్చిలో సీనియర్ సిటిజన్స్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ఎంపీ ముఖ్య అతిథిగా హాజరై కావ్య మాట్లాడారు. చిన్నప్పటి నుంచి మనల్ని ఎంతో ప్రేమతో పెంచి పెద్దచేసిన వారిని వృద్ధాప్యంలో నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీ, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రాంబాబు, మాజీ కార్పొరేటర్ గోల్కొండ రాంబాబు, కాంగ్రెస్ నాయకుడు మైసారపు శిరిల్ లారెన్స్ తదితరులు పాల్గొన్నారు.

**బాలసముద్రం, న్యూస్‌టుడే :** లాభాలతో నడుస్తున్న సంస్థలను ప్రైవేటీకరణ చేయడం తగదని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. బాలసముద్రంలోని ఎల్ఐసీ భవన్‌లో నిర్వహించిన ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ (ఐసీఈయూ) వార్షికోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించడానికి ఎల్ఐసీ సంస్థ కేంద్ర ప్రభుత్వానికి పెట్టుబడులు సమకూరుస్తూ చేయూతనిస్తోందన్నారు. అలాంటి సంస్థను ఐపీఓ ద్వారా వాటాలను విక్రయించేందుకు కేంద్రం పూనుకోవడం శోచనీయమన్నారు. యూనియన్ చేసే పోరాటాలకు అండగా ఉంటామన్నారు. అనంతరం సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బి.శ్రీహరి, ఉపాధ్యక్షుడిగా జె.తిరుమల్‌రావు, ప్రధాన కార్యదర్శిగా ఎం.ప్రభాకర్, సంయుక్త కార్యదర్శులుగా కె.నాగభూషణం, చంద్రశేఖర్, కోశాధికారిగా రేష్మ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సతీష్, బీ.ఎస్.రవి, ఆర్.శ్రీనివాస్, సుబ్రమణియన్, భాస్కర్, సుధాకర్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న చందర్‌లాల్ నాయక్ చౌహాన్

**నయీంనగర్, న్యూస్‌టుడే:** ప్రైవేట్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఆల్ ప్రైవేట్ టీచర్ల అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు చందర్‌లాల్ నాయక్ చౌహాన్ అన్నారు. ఆదివారం హనుమకొండలోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల ఆడిటోరియంలో ప్రైవేట్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు సత్కార కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ నేత విష్ణువర్ధన్‌రెడ్డి, కేయూ అర్థశాస్త్రం విభాగం ఆచార్యులు డా.తిరుణహరి శేషు హాజరయ్యారు. విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడుతున్న ఉపాధ్యాయులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందించి సత్కరించారు. విద్యార్థినులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సంఘం బాధ్యులు, కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

**బాలసముద్రం:** న్యూశాయంపేట సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎన్పీడీసీఎల్ ఆపరేషన్స్ విభాగం హనుమకొండ డీఈ సాంబరెడ్డి తెలిపారు. విద్యుత్తు నగర్, దీన్‌దయాళ్ నగర్, పోస్టల్ కాలనీ ప్రాంతాల్లో ఆ సమయంలో కరెంటు ఉండదని, వినియోగదారులు, వ్యాపారులు సహకరించాలని ఆయన కోరారు.



## పూర్వ విద్యార్థుల సమ్మేళనం


నారాయణగిరిలో.. .

**శాయంపేట, న్యూస్‌టుడే:** శాయంపేట మండలం గట్లకానిపర్తిలోని నాగార్జున పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 2005-06 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు సమావేశమయ్యారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ గుర్రం అశోక్, ప్రధానోపాధ్యాయుడు గడ్డం రమేష్, పూర్వ విద్యార్థులు లోకేష్, సన్నీ, ప్రవీణ్, రాజేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


శాయంపేట మండలం గట్లకానిపర్తిలో..

**ధర్మసాగర్ :** మండలంలోని నారాయణగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1995-96వ విద్యా సంవత్సరం పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. 28 సంవత్సరాల తర్వాత కలుసుకోవడంతో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఆహ్వానించి సత్కరించారు.

### 9న ఎమ్మార్పీఎస్ కలెక్టరేట్ ముట్టడి

**కమలాపూర్, న్యూస్‌టుడే:** ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా.. దాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకుండా డీఎస్సీ నియామకాలు చేపట్టడం చూస్తే మాదిగలను మోసం చేయడమేనని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు జి.సుకుమార్ అన్నారు. ఆదివారం కమలాపూర్‌లోని అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ మందకృష్ణ మాదిగ నేతృత్వంలో ఈ నెల 9న అన్ని జిల్లాల కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. మాదిగ విద్యార్థులు, నిరుద్యోగులు, మేధావులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు పోడేటి రాజు, అంకిల్ల రాజు, చిలువేరు సంపత్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

### ఓరుగల్లు వాకర్స్ వార్షికోత్సవం

**బాలసముద్రం, న్యూస్‌టుడే :** ఓరుగల్లు వాకర్స్ సంఘం వార్షికోత్సవాన్ని ఆదివారం హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఘనంగా నిర్వహించుకున్నారు. అధ్యక్షుడు పెరుకారి శ్రీధర్‌రావు మాట్లాడుతూ.. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం నడక అలవర్చుకుంటే ఆరోగ్యానికి ఎంతో మేలని అన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ.. వ్యాయామం చేయడంతో పాటు సమతుల్య ఆహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందుకున్న ఆకుల సరిత, ఓమా ప్రకాశ్, ఎరబాటి కిరణ్మయి, రచయిత చిందం రవీందర్‌ను సన్మానించారు. సంఘం నాయకులు రమేష్‌రెడ్డి, రవికుమార్, ప్రవీణ్ కుమార్, వేణుగోపాలరావు, రవీందర్‌రావు, రాంగోపాల్‌రావు, కిషన్‌రావు, అమర్నాథ్‌రెడ్డి, వినోద తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా

### పీఆర్ ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నిక

**సుబేదారి, న్యూస్‌టుడే:** పంచాయతీరాజ్ శాఖ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో అధ్యక్షుడిగా కోడం రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా చాట్ల రవికుమార్, అసోసియేట్ అధ్యక్షునిగా కె.శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా జి.సునీల్‌కుమార్, కె.శ్రీనివాస్, బి.సత్యనారాయణరెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా పి.అర్పిత, వి.పల్లవి, జి.రమేష్, జి.రజినీదేవి, కోశాధికారిగా ఎండీ ఖాజాఇక్బాల్, జేసీసీ సభ్యునిగా ఎ.వసంత్‌రామ్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా ఎం.కరుణకుమారి, సీహెచ్ వేణుగోపాల్, పి.కళాజ్యోతి, రాష్ట్ర కౌన్సిలర్లుగా ఎం.పూర్ణచందర్, డి.ప్రవీణ్, పి.జయరాం, బి.వెంకటేశ్వర్లు, ఈసీ సభ్యులుగా బి.ప్రదీప్, శ్రీనివాస్‌రావు, ఎండీ అబ్దుల్ రఫీక్, భాగ్యలక్ష్మి, కె.చంద్రశేఖర్, ఎండీ ఇఫ్తార్ మహ్మద్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏపాల సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ పంచాయతీరాజ్‌లో పర్యవేక్షకులుగా పనిచేస్తున్న వారికి గెజిటెడ్ హోదా కల్పించాలన్నారు. ఎన్నికల అధికారిగా శ్రీనివాస్‌రావు వ్యవహరించారు.

### సమస్యలు పరిష్కరించాలని వినతి

**కార్పొరేషన్:** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ సివిల్ కాంట్రాక్టర్స్ అడహక్ కమిటీ ప్రతినిధులు ఆదివారం ఎస్ఈ రాజయ్య, ఈఈ శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందించారు. 'వర్క్ బిల్ పాస్ ఆర్డర్', పెండింగ్ బిల్లులు, పట్టణ ప్రగతి, 15వ ఆర్థిక సంఘం, సీఎం హామీల పథకం బిల్లులు ఇవ్వాలని, 2024-25 ఎస్ఎస్ఆర్ రేట్లు పెంచాలని, పూర్తయిన పనులకు వెంటనే ఎంబీ రికార్డు చేయాలని కోరారు.

### అసభ్యకర సందేశాలపై ఫిర్యాదు

వరంగల్‌క్రైం: నక్కలగుట్ట ప్రధాన రహదారిపై ఓ హోటల్ సెక్యూరిటీ విభాగంలో పనిచేస్తున్న వ్యక్తి మరొకరితో తన గురించి అసభ్యకరంగా సందేశాలు చాటింగ్ చేశారంటూ అదే హోటల్‌లో పనిచేస్తున్న మహిళ ఆదివారం సుబేదారి ఠాణాలో ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం మేరకు... రోజు వారీ విధులకు హాజరయ్యే ఉద్యోగుల ఫొటోలను తీసి హోటల్ గ్రూప్‌లో పోస్ట్ చేయాలి. మహిళా ఉద్యోగి ఫొటో తీసిన సెక్యూరిటీ గార్డు దాన్ని బయటి వ్యక్తికి పంపించాడు. గత కొద్దిరోజుల నుంచి ఫొటోలు చూస్తూ అసభ్యకరమైన సందేశాలు పంపించుకున్నారు. ఈ విషయం తెలియడంతో బాధిత మహిళ పోలీసులను ఆశ్రయించారు.

### రెడ్డి సంఘం రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడి నియామకం

**న్యూశాయంపేట, న్యూస్‌టుడే:** తెలంగాణ రెడ్డి సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా అర్జుల కిషన్‌రెడ్డి నియమితులయ్యారు. ఆదివారం హంటర్‌రోడ్డులోని వేడుక మందిరంలో నిర్వహించిన జిల్లా రెడ్డి సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి ఈ మేరకు ప్రతిపాదించగా.. సభ్యులు ఆమోదించారు. అనంతరం జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. పేద రెడ్ల సమస్యల పరిష్కారానికి అందరూ ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్ల సంజీవరెడ్డి, ఉపాధ్యక్షుడు చందుపట్ల నర్సింహారెడ్డి, నాయకులు దామోదర్‌రెడ్డి, గంట సంజీవరెడ్డి, నంద్యాల కృష్ణారెడ్డి, వీసం సురేందర్‌రెడ్డి, పరకాల మార్కెట్ కమిటీ ఛైర్మన్ సంజీవరెడ్డి, కట్ట రఘుపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## బాణసంచా అక్రమ నిల్వ



స్వాధీనం చేసుకున్న టపాసులతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

**వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే:** ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా బాణసంచా నిలువ ఉంచిన గోదాంపై ఆదివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్ కథనం మేరకు... దీపావళి సమీపిస్తుండటంతో వరంగల్ జిల్లా పర్వతగిరికి చెందిన కొత్త రవితేజా కొంతకాలం క్రితం ఎలాంటి అనుమతులు లేకుండా బాణసంచా తీసుకొని వచ్చి ప్రైవేటు గోదాంలో ఉంచారు. విశ్వసనీయ సమాచారం రావడంతో పర్వతగిరి పోలీసులు, టాస్క్‌ఫోర్స్ సంయుక్తంగా దాడి చేసి, రూ.24 లక్షల విలువైన బాణసంచాను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రంజిత్‌కుమార్, ఎస్సై దిలీప్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వందేభారత్ రైలు తగిలి ఒకరికి తీవ్రగాయాలు

**కాజీపేట, న్యూస్‌టుడే:** హసన్‌పర్తి రైల్వే స్టేషన్‌లో వందే భారత్ రైలు తగిలి గుర్తుతెలియని వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. శనివారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో వృద్ధుడు ప్లాట్‌ఫాం అంచున నడుచుకుంటూ వెళ్తుండగా వందేభారత్ రైలు వేగానికి పట్టాలపై పడిపోయి తీవ్రంగా గాయపడటంతో జీఆర్పీ పోలీసులు 108 వాహనం ద్వారా ఆసుపత్రికి తరలించారు. వృద్ధుడు నెరిసిన గడ్డం కలిగి, లుంగీ కట్టుకొని ఉన్నాడని, సంబంధీకులు ఎవరైనా ఉంటే 94400 27342 నెంబరుకు ఫోన్ చేయాలని జీఆర్పీ పోలీసులు తెలిపారు.

## జోగిని వ్యవస్థను ధిక్కరించిన నవల 'త్రికాల'


నవలను ఆవిష్కరిస్తున్న అంపశయ్య నవీన్ తదితరులు

**కాజీపేట, న్యూస్‌టుడే:** జోగిని వ్యవస్థ నుంచి బయట పడి తమను తాము ఉన్నతీకరించుకున్న కొందరు స్త్రీల గాథలకు త్రికాల నవల అద్దం పడుతుందని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్ అన్నారు. డాక్టర్ సంధ్యా విప్లవ్ రచించిన త్రికాల నవల ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి దర్గాపోచమ్మ రోడ్డులోని సావిత్రిబాయి పులే భవనంలో తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వలుపదాసు రమ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లాలో వాస్తవికతను ఆధారం చేసుకుని పరిశోధన చేసి రచన చేయడం అభినందనీయమన్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక సభ్యురాలు ఆచార్య కాత్యాయిని విద్మహే మాట్లాడుతూ.. జోగిని వ్యవస్థలోని దుఃఖం నుంచి విముక్తికి ఆరాటపడుతూ శక్తులన్నింటిని కూడగట్టుకని వ్యక్తులు చేసిన విజయగాథే ఈ నవల అన్నారు. రచయిత బన్న అయిలయ్య, టీవీవీ మాజీ అధ్యక్షుడు చంద్రభాను, కవులు, రచయితలు పాల్గొన్నారు.

## పరకాల నియోజకవర్గం

### 'మాదిగలకు ద్రోహం చేస్తున్న సీఎం'


మాట్లాడుతున్న సుకుమార్‌మాదిగ

**దామెర, న్యూస్‌టుడే:** ఎస్సీ వర్గీకరణ లేకుండానే ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాదిగలకు ద్రోహం చేస్తున్నారని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సుకుమార్‌మాదిగ అన్నారు. పులుకుర్తిలో ఆదివారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పును స్వాగతించిన ముఖ్యమంత్రి.. వర్గీకరణ లేకుండానే ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడం సరికాదన్నారు. ఈ నెల 9న హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు నల్లజెండాలతో ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. సంఘం జిల్లా కార్యదర్శి స్వరాజ్‌మాదిగ, నాయకులు ఎర్ర రాము, బొక్క రాజేష్, కమలాకర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

### గుప్తనిధుల తవ్వకాలపై కేసు నమోదు

**దామెర, న్యూస్‌టుడే:** దామెర మండలం చంద్రగిరిగుట్టల్లో ఇటీవల జరిగిన గుప్తనిధుల తవ్వకాలపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వివరాలివి.. కోగిల్వాయిలోని ఆంజనేయస్వామి విగ్రహం వద్ద గుర్తు తెలియని వ్యక్తులు గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపట్టారు. ఆర్ఐ భాస్కర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

### బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

**శాయంపేట:** వసంతాపూర్‌లోని బాపూజీ పురుషుల సంఘం సభ్యుడైన ఆకునూరి రమేష్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. సంఘ సభ్యులు ఆదివారం రమేష్ కుటుంబ సభ్యులకు రూ.70 వేల సాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఉస్మాన్, ఉపాధ్యక్షుడు ప్రేమ్‌సాగర్, మల్లాజీ, పాపారావు, విజయరావు తదితరులు పాల్గొన్నారు.

### శాలివాహన సంఘం కమిటీ ఎన్నిక

**దామెర, న్యూస్‌టుడే:** వీరభద్ర శాలివాహన సంఘం కమిటీని ఆదివారం దామెరలో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా దామెరుప్పుల శంకర్, అధ్యక్షుడిగా దామెరుప్పుల భద్రయ్య, ఉపాధ్యక్షుడిగా అశోక్, పలువురు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

### బతుకమ్మ చీరలు వెనక్కి



భారాస ప్రభుత్వం గతంలో దసరా పండగ సందర్భంగా మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేసింది. ఆత్మకూరు మండలంలోని వివిధ పంచాయతీల్లో నిల్వ ఉన్న 2500 చీరలను మండల పరిషత్ కార్యాలయానికి తరలించి నిల్వ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆదేశాల మేరకు చీరలను వెనక్కి పంపిస్తున్నామని అధికారులు తెలిపారు. వీటిలో కొన్ని చీరలు చినిగిపోయాయి.

– న్యూస్‌టుడే, ఆత్మకూరు (పరకాల)

